క్లుప్తంగా

ఎల్‌టీ లైన్ మార్చాలి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని శాఖాపూర్.వై గ్రామంలోని దేవాలయం వరకు ఎల్‌టీలైన్ కండక్టర్ వైరు మార్చాలని గ్రామస్తులు సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ సురభికి విన్నవించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు సంద చెన్నకేశవులు, శ్రీను, సహదేవుడు, నరేష్, రమేష్, నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి ఎస్‌ఐగా యుగంధర్‌రెడ్డి



కొత్తకోట రూరల్: పెద్దమందడి ఎస్‌ఐగా యుగంధర్‌రెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. యుగంధర్‌రెడ్డి గతంలో వనపర్తి పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. పెద్దమందడి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శివకుమార్ వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని అన్నారం, అన్నారంతండా, రేమద్దుల, కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలలు, గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలన్నారు.

'డీజేలు అనుమతి లేదు'

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణేష్ మండపాల వద్ద డీజేలు వాడితే డీజే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నందికర్ హెచ్చరించారు. డీజే వాడడం వల్ల పరిసర కుటుంబాల ప్రజలు ఇబ్బందులకు గురవుతారని, దాంతో పాటు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే డీజే సౌండ్ యజమానులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గణపతి హోమం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సోమవారం గణపతి హోమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో అతివృష్టి, అనావృష్టి బారిన పడకుండా ఉండేందుకు, ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటూ గణపతి హోమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న గణపతి హోమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. హోమం అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

పాఠశాలకు బీరువా వితరణ



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆత్మకూర్ పట్టణానికి చెందిన బంగారు నగల వ్యాపారి డీకే ప్రకాష్ బీరువాను సోమవారం వితరణ చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు అనురాధ తో ప్రాథమిక విద్యభ్యాసం చేసిన ప్రకాష్ విద్య నేర్పిన గురువు సూచనలతో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాడు. ఈక్రమంలో బదిలీపై అమరచింత ఉన్నత పాఠశాలకు అనురాధ రావడంతో ఆమె సూచనల మేరకు రూ.15 వేల విలువ గల బీరువాను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపధ్యాయురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

చిన్నంబావి: హన్మకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థి ఇర్ఫాన్‌అలీ ఎన్నికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ లింగస్వామి తెలిపారు. కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం సన్మానించారు.



కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో..



శ్రీరంగాపురం పాఠశాలలో..

కాళోజీ సేవలు మరువలేనివి



పాన్‌గల్ మండలం చింతకుంట ఉన్నత పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమరచింత: ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు తెలంగాణ ప్రజల్లో కలకాలం నిలిచి ఉంటాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ నురుల్‌నదీం, మేనేజర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు రేమద్దుల, చింతకుంట గ్రామాల్లో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రేమద్దుల ప్రాథమిక పాఠశాల, చింతకుంట ఉన్నత పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎంలు లక్ష్మీదేవి, సెక్యానాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవీందర్, కౌన్సిలర్లు చీర్లనాగన్నసాగర్, తిరుపతయ్య, కొండారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల, శ్రీరంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాపర్ల పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు ఇందిరమ్మ, శివలీలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, శ్రీధర్, కవిత, శివాని పాల్గొన్నారు.

కాళోజీ ఉద్యమాలు ఆదర్శప్రాయం



వనపర్తిలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

వనపర్తిటౌన్: ప్రజా ఉద్యమాలే జీవన సర్వస్వంగా ప్రజలకు అండగా నిలిచిన ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా అధికారి మనోజ్ కుమార్, స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పుర కమిషనర్ పూర్ణచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరెడ్డి, కౌన్సిలర్లు భువనేశ్వరి, వెంకటేష్, నాయకులు లక్కాకుల సతీష్, పరశురాం, ఎల్ఐసీ కృష్ణ, స్టార్ రహీం, అధికారులు, లైబ్రేరియన్ శ్రీనివాసులు, గ్రంథాలయ సిబ్బంది తేజకుమార్, వెంకటేశ్వరమ్మ, చైతన్య, చెన్నయ్య, మహనీయుల స్ఫూర్తి రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్, సంఘం నాయకులు, కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, గంధం నాగరాజు, దేవన్న నాయుడు, బాలేమియా, వెంకటస్వామి, రాములు, పరమేశ్వరచారి, మురళీధర చారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



యాపర్ల పాఠశాలలో..



అమరచింతలో..



పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

రాకపోకలకు ఇబ్బందులు రానివ్వొద్దు



కాజ్‌వేను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, తహసీల్దార్ అబ్రహం

మదనాపురం: మండల కేంద్రం సమీపంలోని శంకరసముద్రం, సరళాసాగర్ వరద నీటితో ఊకచెట్టు వాగు పారుతున్న నేపథ్యంలో కాజ్‌వేపై చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజల రాకపోక ఇబ్బందులు లేకుండా చూడాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ అధికారులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన స్థానిక నాయకులతో కలిసి కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న తహసీల్దార్ అబ్రహంలింకన్‌తో ఆయన మాట్లాడుతూ.. గూనల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ నీటి ఉధృతి తగ్గిన వెంటనే రాకపోకలకు ఏర్పాట్లను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు జగదీష్, అక్కల మహాదేవన్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, సాయిబాబా, రామకృష్ణ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడు రహదారిని బాగుచేయండి



రామన్‌పాడ్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూర్: పట్టణం మీదుగా రామన్‌పాడ్ రహదారిని బాగు చేయాలని సీపీఎం నాయకులు రాజు, అజయ్, ఆంజనేయులు, దేవన్న డిమాండ్ చేశారు. సోమవారం ప్రయాణికులతో కలిసి మోకాళ్ల లోతు గుంతలమయంగా మారిన రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. మదనాపురం నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు రామన్‌పాడు మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తుందని, గతుకుల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీజేపీ పరిధిలోకి వచ్చే ఈ రోడ్డును ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు చేపట్టి వర్షాల అనంతరం శాశ్వతంగా బీటీ రోడ్డును నిర్మించాలని కోరారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం



ఇరిగేషన్ అధికారులతో నీటమునిగిన పంటలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చెప్పారు. సోమవారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. అనంతరం బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్నారు. అంతకంటే ముందు పెద్దమందడి మండలం వెల్టూరులోని గోపాలసముద్రం చెరువు బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయిన పంటలను పరిశీలించారు. గతంలో వచ్చిన భారీ వర్షాలకు రాని నీరు ఇప్పుడు పంటపొలాల్లోకి ఎలా వచ్చిందో తెలుసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అక్కడికి వచ్చిన రైతులు ఇటీవల చేసిన మరమ్మతుల సమయంలో అలుగును పెంచారని దాంతో తమ పొలాల్లోకి నీరు చేరుతోందని తెలిపారు.

బాలల రక్షణకు ప్రత్యేక చట్టాలు



గోపాల్‌పేట: బాలబాలికలు అందరూ వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఐసీపీఎస్ సోషల్‌వర్కర్ లక్ష్మమ్మ అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఇప్పటి నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధన కోసం చదవాలని సూచించారు. బాలబాలికలను ఇబ్బందులకు గురిచేసినా లేదంటే ఒత్తిడికి గురిచేసినా 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే సాయం అందిస్తామన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఆత్మకూర్: గతుకుల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని, మంజూరయిన రోడ్డును ఏళ్లుగా నిర్మించడం లేదని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ ఆత్మకూర్ నుంచి మూలమళ్లకు రోడ్డును నిర్మించాలని, గద్వాల డిపో ఆర్టీసీ బస్సులను మూలమళ్ల మీదుగా నడిపించాలని, చెరువు అలుగు వద్ద బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోష, శ్రీహరి, రాబర్ట్ ఉన్నారు.



పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన



పాన్‌గల్: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సోమవారం వ్యవసాయ అధికారులు మండలంలోని బహదూర్‌గూడెం, బండపల్లి, వెంగళాయిపల్లి, అన్నారం, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా, శాఖాపూర్ తదితర గ్రామాల్లో సేకరించారు. వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని ఏఓ సాజిద్ రహమాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శైలజ, అఖిల, వెంకటేష్, షర్మిలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి తండ్రి జి.కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే స్వగ్రామమైన చిన్నచింతకుంట మండలం ధమగ్నాపూర్‌కు వెళ్లి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, మోహన్‌రెడ్డి, పెంటన్నయాదవ్, రాములుయాదవ్ తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని జనుంపల్లికి చెందిన ప్రమీలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సోమవారం గ్రామంలో మాజీ సర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, పెద్దింటి వెంకటేష్, మధు, ఖాజ పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన

ఆత్మకూర్: సమాచార చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ హక్కుల గుర్తించాలని తహశీల్దార్ రాజు అన్నారు. సోమవారం సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న నారాయణపేటలో నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను నిర్వాహకులతో కలిసి విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు బోరెల్లి రాము, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కోడి పందేలపై దాడి

వనపర్తి రూరల్: కోడిపుంజుల పందెం స్థావరాలపై సోమవారం సాయంత్రం దాడి చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన కొందరు వ్యక్తులు కోడిపుంజు పందెంలు కాస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదు బైకులు, నాలుగు కోడిపుంజులు, రూ.2,160 నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పరిహారం చెల్లింపులో అలసత్వం వద్దు



అమరచింతలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

వీపనగండ్ల: వర్షాల కారణంగా పంటలు, ఇళ్లను కోల్పోయిన రైతులు, బాధితులకు పరిహారం చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా.. ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఎండీ ఫయాజ్ అన్నారు. సోమవారం మండలంలోని బొల్లారం చౌరస్తాలో పంటలను కోల్పోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.25వేలు, ఇళ్లను కోల్పోయిన వారికి తక్షణ సాయంగా మరో రూ.25వేల రూ.లు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. పలు మండలాల్లో భీమా, కేఎల్ఐ, జూరాల కాల్వలు తెగిపోవడం వల్ల రైతుల పంట పొలాల్లో ఇసుక మేట వేసిందని, వాటి తొలగింపునకు ప్రభుత్వమే ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, వంక గోపాల్, చల్మారెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: వర్షాల కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కుమార్, బద్యానాయక్, వెంకట్రాములు, పాలెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొత్తకోట రూరల్: తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా నడుస్తున్న వెల్ఫేర్ బోర్డు నిధులు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం ద్వారా భవన నిర్మాణ కార్మికులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం నిబంధనల ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని కార్మిక సంఘాల ప్రజాప్రతినిధులతో నియమించి వారి ఆమోదంతోనే బోర్డు నిధులు ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా అడ్వైజర్ కమిటీని నియమించకుండా గత పాలకులు ఇష్టానుసారంగా రూ.1,005 కోట్లు సివిల్ సప్లయర్స్ శాఖకు, రూ.500కోట్లు బీసీ సబ్‌ప్లాన్‌కు, సీఎస్‌సీ వైద్య పరీక్షల పేరుతో రూ.300కోట్లు, ఐటీఐ పేరుతో రూ.325కోట్లు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.92కోట్లు ఇలా మొత్తం రూ.2వేల కోట్లకు పైగా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నిక్సన్, వెంకటయ్య, కురుమూర్తి, వెంకటయ్యయాదవ్, లక్ష్మన్న, కుర్మన్న, డి.రాములు, సి.రమేష్, జయరాములు, జి.వెంకటేష్, ఎం.కురుమూర్తి, అంజి, నారాయణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొర్లకుంటలో వైద్య శిబిరం ఏర్పాటు



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

వీపనగండ్ల: మండలంలోని కొర్లకుంటలో విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వర బాధితులను గుర్తించి వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. గ్రామంలో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలు సోకిన వారు లేరని డాక్టర్ హేమవర్ధన్ అన్నారు. కొద్దిపాటి జ్వరం సోకినా వెంటనే అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే వెంటనే తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష, పంచాయతీ కార్యదర్శి రాముడు, ఏఎన్ఎంలు గీత, మల్లేశ్వరి, ఆశావర్కర్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



కొత్తకోటలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 9మందికి మంజూరయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, మిషేక్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సాయిలుయాదవ్, మహేష్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన బింగిదాస్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సురభి పుల్లారావు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం..

గ్రామానికి చెందిన గంధం నారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాంగ్రెస్ నాయకుడు సురభి పుల్లారావు రూ.6 వేలు ఆర్థికసాయం అందజేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దీంతో పాటు సింగిల్ విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్ 50 కేజీల బియ్యం అందజేశారు.

శ్రీనిధి రుణాలపై విచారణ



విచారణ చేస్తున్న ఏపీఎం

వనపర్తి రూరల్: వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో శ్రీనిధి ద్వారా మహిళలు రుణాలు తీసుకొని గ్రామ సంఘానికి చెల్లించే విషయంలో నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామస్తుడు నరసింహ మండల మహిళా సమాఖ్యలో ఫిర్యాదు చేశారు. సోమవారం ఏపీఎం వెంకన్న శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ శివతో కలిసి గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రాథమిక విచారణ చేపట్టారు. మదర్‌థెరిస్సా మహిళా సంఘానికి శ్రీనిధి ద్వారా రూ.6.50లక్షల రుణం ఇవ్వగా.. వారు ప్రతి నెల శ్రీనిధికి చెల్లించిన రికార్డులను పరిశీలించారు. దీంతో రూ.34 వేల బకాయి రుణం చెల్లించాల్సి ఉందని వారు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామంలో 20 సంఘాలకు శ్రీనిధి ద్వారా రుణాలు ఇచ్చామని, అన్ని సంఘాల రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించడానికి 7 రోజుల సమయం పడుతుందన్నారు.

రుణమాఫీలో జాప్యంతో రైతుల ఆందోళన

పాన్‌గల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల రుణమాఫీ కాక రైతులు ఆందోళన చెందుతున్నారని, రుణమాఫీలో అధికారులు నిర్లక్ష్యం విడనాడకుంటే రైతులతో కలిసి బ్యాంకుల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అర్హత ఉండి రుణమాఫీ కానీ రైతులకు ఆగస్టు 7వ తేదీలోగా దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి మాఫీ చేస్తామన్నా హామీ నెరవేర్చలేదన్నారు. చాలా మంది రైతులు బ్యాంకులు, సింగిల్ విండో, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కాకం బాలస్వామి, సహదేవ్, లింగన్న, పరంధాములు, శంకరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.